నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | డిసెంబర్ 22, 2023 | www.navatelangana.com

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

నవతెలంగాణ-భీమిని



మండలం చిన్నగుడుపేట గ్రామంలో గుర్తుతెలియని పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం చెందిన రాజా గౌడ్(60) ఆర్థిక సమస్యలుతో పాటు ఇంట్లో తరచుగా గొడవలు జరిగేవి. దీంతో మానసిక వేదకు గురైన రాజాగౌడ్ ఉదయం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని కొడుకు సాయిప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్ర మంత్రులను కలిసిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నవతెలంగాణ-జైపూర్



రాష్ట్ర మంత్రులను గురువారం కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోమాస శ్రీనివాస్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వంగా కలిశారు. కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వంలో మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లను కలిసి శాలువాలతో సన్మానించి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడుతోందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు మెనిఫెస్టోలో పొందుపర్చిన ప్రతి హామీ నెరవేర్చుతుందని ఈ సందర్భంగా గోమాస శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు.

సర్పంచ్ గిరిపై..యువత గురి..!

- రంగంలోకి దిగేందుకు అనేక మంది ఆసక్తి
- సామాజిక, సేవా కార్యక్రమాలతో జనంతో మమేకం
- నోటిఫికేషన్ కోసం ఆతృతగా ఎదురుచూపులు

ఉన్న ఊరు..కన్నతల్లిలాంటిది. పుట్టిన ఊరికి ఏదైనా ఉపకారం చేయాలని భావిస్తుంటారు. గతంలో సర్పంచ్ పదవుల్లో ఎక్కువ మంది 40ఏండ్లకు పైబడిన వారు మాత్రమే ఉండేవారు. ఎవరైనా యువకులు పోటీ చేయాలని భావించినా..ఇంకా నీకు సమయం ఉంది..ఇప్పుడే వద్దు అనే వారు. కానీ ప్రస్తుతం ట్రెండ్ మారింది. గ్రామ అధ్యక్ష పీఠంపై కూర్చునేందుకు యువత సైతం ఆసక్తి చూపిస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే చాలా గ్రామాల్లో యువత సర్పంచ్‌లుగా పదవుల్లో ఉన్నారు. తాజాగా మరింత మంది యువత సైతం ఈ పదవిని అలంకరించేందుకు సిద్ధమవుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం గ్రామస్తులు సైతం యువతకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తున్నారు. సర్పంచ్‌లుగా ఎన్నికైతే ఊరికి చేయాల్సిన ఉపకారంపై యువత వారి ప్రచారం చేస్తుండటం కారణంగా గ్రామస్తులు సైతం వారి పట్ల ఆకర్షితులవుతున్నట్లు తెలుస్తోంది.

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

గ్రామ సర్పంచ్ పదవికి అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. ప్రభుత్వ పథకాలతో పాటు గ్రామంలో ఏ సమావేశం నిర్వహించినా..ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఎవరు వచ్చినా..తొలుత సర్పంచ్‌నే సంప్రదిస్తుంటారు. ఈయనే ఆ సమావేశానికి అధ్యక్షత వహిస్తుంటారు. ప్రస్తుతం యువత సైతం రాజకీయాల్లో రాణించాలని భావిస్తున్నారు. ఇందులో రాణించాలంటే మొదట సర్పంచ్‌గా పోటీ చేసి గెలిస్తే..మండల స్థాయి..ఆ తర్వాత జిల్లా స్థాయితో పాటు ఉన్నత పదవులను చేపట్టేందుకు అవకాశం ఉంటుందని అనుకుంటున్నారు. ఒకప్పుడు సర్పంచ్ పదవి అంటే యువత అంతగా ఆసక్తి చూపించేవారు కాదు. కానీ మారిన పరిస్థితులు, ప్రభుత్వం నుంచి దండిగా నిధులు వస్తుండటం.. వాటిని గ్రామాభివృద్ధికి వినియోగిస్తూ అభివృద్ధి చేస్తే మంచి పేరు సంపాదించవచ్చనే ఆలోచనతో అనేక మంది ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కొక్కరు ఒక్కో రీతిన ఆలోచన చేస్తూ గ్రామాల్లో మౌళిక వసతలు కల్పన, అభివృద్ధి పనులతో వారి పల్లెలను స్వయంగా అభివృద్ధి చేసుకుంటున్నారు. దీంతో మిగితా యువతలో ఈ పదవిపై ఉత్సాహం పెరిగేందుకు కారణమవుతోంది.

సామాజిక కార్యక్రమాలతో మమేకం..!

అనేక ఏండ్ల నుంచి గ్రామాల అభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషిస్తున్నారు. యువజన సంఘాలుగా ఏర్పడి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం.. శ్రమధానంతో పాటు పాఠశాలల్లో పిల్లలను చేర్పించడంతో పాటు గ్రామంలో చేపట్టే శుభకార్యాల్లో పాలు పంచుకుంటూ ఊరి జనం అభిమానాన్ని సంపాదించుకుంటున్నారు. ఇలా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ గ్రామస్తుల్లో తల్లో నాలుకగా ఉంటున్నారు. వీరిలో చురుగ్గా యువకులు గ్రామస్తుల మద్ధతుతో రాజకీయాల్లోనూ రాణించేందుకు సంసిద్ధులవుతున్నారు. ఈ క్రమంలోనే తొలుత సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిపోవడంతో సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేయడంతో ఇప్పట్నుంచే అనేక మంది వీటిపై కన్నేశారు. ఇప్పటికే గ్రామాల్లో తాము పోటీలో ఉంటామని పరోక్షంగా సంకేతాలు ఇస్తున్నారు. కొందరైతే ప్రచారాన్ని సైతం ప్రారంభించారు. రిజర్వేషన్లు ఎవరికి వస్తాయోనని ఆసక్తిగా చూస్తున్నారు. నోటిఫికేషన్ రావడమే తరువాయి నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతుండటం ఆసక్తికరంగా మారింది.



పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నా

మరప రుణేష్, యువకుడు, వాన్వట్



సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయాలని చాలా రోజుల నుంచి అనుకుంటున్నాను. గ్రామంలో వివిధ రకాల మౌళిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నాను. సర్పంచ్‌గా పోటీ చేసి రాజకీయాల్లోనూ రాణించాలని ఉంది.

యువత రాజకీయాల్లోకి రావాలి

పెందూర్ చందర్‌షావ్, యువకుడు, లోహర



రాజకీయాలతోనే అందరి జీవితాలు ముడిపడి ఉంటాయి. ఇక్కడ తీసుకొనే నిర్ణయాలతో పేదల జీవితాల్లో వెలుగులు తీసుకురావచ్చు. ముఖ్యంగా యువత ఎక్కువ మంది రాజకీయాల్లోకి వస్తే బాగుంటుంది. ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు సక్రమ పద్ధతిలో సద్వినియోగం చేస్తే గ్రామాల అభివృద్ధికి బాటలు వేయవచ్చు.

మహిళల అభివృద్ధికి మహిళా సాధికారత హబ్



నవతెలంగాణ-నస్పూర్

బాలికల, మహిళల సంరక్షణ, సంక్షేమం, అభివృద్ధికి మహిళా సాధికారత హబ్ కృషి చేస్తుందని మహిళా సాధికారత హబ్ జిల్లా కోఆర్డినేటర్ సౌజన్య అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ, జూనియర్ కళాశాల (బాలికలు)లో హబ్ జెండర్ స్పెషలిస్టులు విజయతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ మాట్లాడుతూ జిల్లా సంక్షేమశాఖ అధికారి ఆదేశాల మేరకు మహిళా సాధికారత హబ్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఇందులో బాలికలు, మహిళల సంరక్షణ కొరకు చేపట్టిన కార్యక్రమాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. భేటీ బచావో-భేటి పడావో, లింగ వివక్షత, లింగ సమానత్వం, బాలిక విద్య బాల్యవివాహాల నిరోధక చట్టం, గుడ్ టచ్-బాడ్ టచ్, సైబర్ క్రైమ్, మహిళా హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ హెల్ప్ లైన్ 100, సీనియర్ సిటిజన్ హెల్ప్ లైన్ 14567 తదితర అంశాలపై వివరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ మౌనిక పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు నిరంతరంగా కొనసాగాలి

- జిల్లా పంచాయతి అధికారి వెంకటేశ్వర్ రావు



నవతెలంగాణ-జైపూర్

ప్రతి గ్రామ పంచాయతీలో రోజు వారిగా పారిశుధ్యపు పనులు నిరంతరంగా కొనసాగాలని జిల్లా పంచాయతి అధికారి డీ వెంకటేశ్వర్ రావు సూచించారు. మొబైల్ ఇన్స్‌పెక్షన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని వేలాల గ్రామ పంచాయతిని సంధర్శించారు. ఈ సంధర్భంగా వివిధ వార్డుల్లో చేపట్టిన పారిశుధ్య పనులు పరిశీలించారు. రహదారులతో పాటు మురికి కాలువలను ప్రతి రోజు శుభ్రపర్చాలని సూచించారు. నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని, సెగ్రిగేషన్ షెడ్‌లో కంపోస్టు ఎరువు తయారి, కాంపోస్టు ఎరువు నర్సరీ మొక్కలు, ప్రకృతి వనంలో మొక్కలకు వినియోగించాలని తెలిపారు. స్మశాన వాటిక పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని పరిసరాల్లోని మొక్కలను సంరక్షించాలని పంచాయతి కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎం అనిల్ కుమార్, స్థానిక సర్పంచ్ ప్యాగ శ్యామల లక్ష్మన్, ఉప సర్పంచ్ డేగ నగేష్ పటేల్, పంచాయతి కార్యదర్శి రాకేశ్ పాల్గొన్నారు.

ఎంపానెల్మెంట్ ఆఫ్ అవుట్ సోర్సింగ్ టెండరు ప్రక్రియ పూర్తి

- జిల్లా పాలనాధికారి బదావత్ సంతోష్



నవతెలంగాణ నస్పూర్

ఎంపానెల్మెంట్ ఆఫ్ అవుట్ సోర్సింగ్ టెండరు ప్రక్రియలో భాగంగా టెండర్లు తెరువడం జరిగిందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్‌తో కలిసి టెండరు ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ టెండరు ప్రక్రియలో భాగంగా 52 టెండరు షెడ్యూల్స్ సేల్ చేయగా 52 బిడ్ చేయడం జరిగిందని, 2 టెండర్లు ఈఎండీ చెల్లించని కారణంగా రద్దు చేయడం జరిగిందని, మిగతా షెడ్యూల్స్ అన్ని సక్రమంగా పరిశీలించి ఎంపానెల్లో ఎంపిక చేయడం జరుగుతుందని, ఇందులో జిల్లా ఉపాధి కల్పన అధికారి, జిల్లా కోశాధికారి, జిల్లా కార్మికశాఖ అధికారులు సభ్యులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక్ వెంకటరమణ, జిల్లా కోశాధికారి జె.రాజేశ్వర్, జిల్లా కార్మికశాఖ అధికారి వినీత పాల్గొన్నారు.

కన్నుల పండువగా అయ్యప్ప ఆరాట్టు ఉత్సవం

నవతెలంగాణ-జన్నారం

పొనకల్ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం ఆధ్వర్యంలో గురువారం అయ్యప్ప స్వామి ఆరాట్టు ఉత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఉదయం అయ్యప్ప, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ విగ్రహాలను మండలంలోని బాదంపెల్లి గోదావరికి తీసుకెళ్లి చక్రస్నానం చేయించారు. వేద పండితులు కాకెరీ రాజనరేంద్ర శర్మ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తెలంగాణ తల్లి విగ్రహం నుంచి అయ్యప్ప స్వామి దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. పేటతుళ్ళి ఆడుకుంటూ, నత్యాలు చేస్తూ స్వామి వారిని తీసుకెళ్లారు. ఈ ఆరాట్టు ఉత్సవంలో గౌరవ అధ్యక్షుడు సామలింగన్న, అధ్యక్షుడు శీల చంద్ర శేఖర్, కోశాధికారి రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి



నవతెలంగాణ-నస్పూర్

యువత అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని జిల్లా పరిషత్ చైర్పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హల్‌లో జిల్లా క్రీడల, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలలో కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. అనంతరం స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లాకు చెందిన యువ కళాకారులకు జానపద నత్యం(గ్రూప్), జానపద నత్యం (సోలో), జానపద పాట (గ్రూప్), జానపద పాట (సోలో), లైఫ్ స్కిల్స్ కాంపోనెంట్ (కథా రచన, పోస్టర్ మేకింగ్, ప్రకటన (డిక్లమేషన్), ఫొటోగ్రఫీ)లలో పోటీలు నిర్వహించారు. విజేతగా నిలిచి ప్రథమ స్థానం పొందిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ యువత కళారంగంలో రాణించి ప్రజలను చైతన్యపరుస్తూ జిల్లాను అన్ని రంగాలలో ముందంజలో ఉంచేందుకు కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం చేపడుతున్న అనేక కార్యక్రమాలు, పథకాలను గ్రామీణ స్థాయి నుంచి అర్హత గల వారు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని, ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకొని సాధించేలా తోటి యువజనులను ప్రోత్సహించాలని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు మంచిపేరు తీసుకువచ్చేలా కళారంగంలో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల, యువజన సర్వీసుల శాఖ అధికారి బి.శ్రీకాంత్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం పాల్గొన్నారు.



వివేక్ వెంకటస్వామి చిత్ర పటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-మందమర్రి

శాషనసభ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వివేక్ వెంకటస్వామి సింగరేణిలో స్థానిక యువతకు 80 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం ఇవ్వాడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వివేక్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గురువారం అఖిలభారత యాదవ మహా సభ జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బండి సదానందం ఆధ్వయంలో ఐఎన్‌టీయూసీ కార్యాలయం, స్థానిక ఇందు గార్డెన్‌లో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సదానందం మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా వివేక్ వెంకటస్వామి యువతకు ఇచ్చిన హామీ మేరకు సింగరేణి సంస్థలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అవకాశం స్థానికులకే 80 కల్పించాలని గెలిచిన 20 రోజుల్లోనే ముఖ్యమంత్రి కి వినతి పత్రం అందించి జీవో వచ్చే విధంగా కృషి చేసినందుకు వెంకటస్వామి కి ధన్యవాదాలు తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ ప్రజలకు కోల్బెల్ట్ ప్రాంత యువతకి ఇది మంచి శుభసూచకం అన్నారు. రాబోయే పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం నియోజకవర్గం లోని ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుర్గం మల్లేష్, సెగ్గం రవికుమార్, రాంటెంకి సురేష్, సుద్దాల రాజుకుమార్, నిరెటి వెంకటేష్, చిప్పకుర్తి శశిధర్, పుప్పాల నరేందర్, గోపతి శారద పాల్గొన్నారు.

కోల్ ఇండియా ఒప్పందాలు అమలుకు కృషి



నవతెలంగాణ-నస్పూర్

కోల్ ఇండియా ఒప్పందాలను సింగరేణిలో అమలు చేసేందుకు కృషి చేస్తామని ఏబీకేఎంఎస్ కార్యదర్శి పులి రాజారెడ్డి అన్నారు. గురువారం ఆర్కే-5బి గనిలో ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన ఆర్కే-8 డిస్పెన్సరీలో నిర్వహించిన అలాయ్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు చెవ్వా మహేష్‌తో కలిసి వారు పాల్గొని మాట్లాడారు. సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో కార్మికులు అమూల్యమైన ఓటును కాగడా గుర్తుపై ఓటు వేసి సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బీఎంఎస్‌ను ఆశీర్వదించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. బొగ్గు గని కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు, ప్రమోషన్ పాలసీలు, అలవెన్సులపై ఆదాయ పన్ను రియంబర్స్ మెంట్ కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇస్తున్నామని అన్నారు. కార్మికుల సంక్షేమం కోసం మెరుగైన విద్య కార్పొరేట్ వైద్యం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కోల్ ఇండియా బొగ్గు గని కార్మికులకు మార్గదర్శిని డిక్షనరీ ప్రతి ఒప్పందం కూడా అమలు చేయుటకు కృషి చేస్తామని తెలిపారు. అలాగే జనరల్ మజ్దూర్ డెసిగ్నేషన్ పేరును మార్చి తగిన విధంగా పేరును కోలిండియా వ్యాప్తంగా చర్చించి నిర్ణయిస్తామని అన్నారు. ఆరు నెలల ముందే వెజ్ బోర్డ్ కమిటీని ఏర్పాటు చేసిన ఘనత బీఎంఎస్ కోల్ సెక్టార్ ఇన్‌ఛార్జ్ లక్ష్మారెడ్డిదని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్యం, సింగరేణి వ్యాప్తంగా మాగ్నెటిక్ రిసోనెన్స్ ఇమేజింగ్(ఎంఆర్ఐ) కొత్తగూడెం, భూపాలపల్లి, రామగుండం, బెల్లంపల్లి ఏరియాలో ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదాసు రవీందర్, జీడి ప్రభాకర్, పాగిడి శ్రీకాంత్, రాగం రాజేందర్, బొంపల్లి రమేష్, మద్దిల శ్రీనివాస్, మేడ వంశీకృష్ణ, ప్రసాద్, మహేష్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీని గుర్తింపు సంఘంగా ఎన్నుకోవాలి

- యూనియన్ అధ్యక్షుడు సీతారామయ్య



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ కేవలం ఏఐటీయుసీ తోనే సాధ్యమవుతుందని యూనియన్ అధ్యక్షుడు వి.సీతారామయ్య పేర్కొన్నారు. మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో గురువారం ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ మనుగడ సాధించాలంటే జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో నక్షత్రం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి శైలెంద్ర సత్యనారాయణ మాట్లాడుతూ ఓటమి భయంతో కొన్ని కార్మిక సంఘాలు యాజమాన్యానికి వంత పాడినా కూడా చివరికిహై కోర్ట్ తీర్పుతో న్యాయం గెలిచిందని, కార్మికుల హక్కుల కోసం నిజాయితీగా పోరాడే ఏఐటీయూసీని గెలిపించి సింగరేణిని కాపాడుకోవాలని ఉద్యోగులను కోరారు. కార్మికుల హక్కులు కాపాడాలన్నా సంస్థలో అవినీతికి తావు లేకుండా ఉండాలన్నా ఏఐటీయుసీ తోనే సాధ్యం అని తెలిపారు. ఏఐటీయుసీ గెలిస్తే కార్మికులు గెలిచినట్టేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సెక్రటరీ ఎండీ అక్బర్ అలీ, ఏరియా కార్యదర్శి సత్యనారాయణ, క్లర్క్ ఇన్‌ఛార్జి నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

నవతెలంగాణ-జన్నారం



మండలం కేంద్రంలోని జింకల పార్కు సమీపంలో గురువారం ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్కు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రోటిగూడకి చెందిన, నగేష్ అనే ఆటో డ్రైవర్ తన ఆటోలో స్కూల్ పిల్లలను ఎక్కించుకొని జన్నారం వస్తుండగా జింకల పార్కు సమీపాన, ఆటో టైర్ పగిలి బోల్తాపడింది. ఆటోలో ఉన్న పిల్లలకు ప్రమాదం జరగలేదు. డ్రైవర్కు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని వడ్యాల్ గ్రామంలో కస్తూరి చిన్న భీమన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు గురువారం బాధిత కుటుంబ సభ్యులను



పరామర్శించారు. డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఒడ్నం రాజేశ్వర్, నాయకులు నాందేడపు చిన్ను, గణేష్ ఉన్నారు.

యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిని కలిసిన జిల్లా యూత్ నాయకులు

నవతెలంగాణ -ఆదిలాబాద్ అర్బన్

యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బీవీ. శ్రీనివాస్‌ను గురువారం జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని యువజన కాంగ్రెస్ కార్యాలయంలో కలిసి జిల్లాలో పార్టీ పరిస్థితులను వివరించారు. ఆయనను కలిసిన వారిలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌గౌడ్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, బోథ్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పోతారెడ్డి ఉన్నారు.



ముక్తాపూర్‌లో వైద్య శిబిరం నిర్వహణ



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ముక్తాపూర్ గ్రామంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశాల మేరకు ఏజెన్సీ అడిషనల్ డీఎంహెచ్ఓ కుంర బాలు వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏజెన్సీ డీఎంహెచ్ఓ, ఉపసర్పంచ్ విష్ణు మాట్లాడుతూ వ్యాధుల నిర్మూలన కోసం ఐటీడీఏ ద్వారా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించడం హర్షనీయమన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ వైద్య శిబిరంలో 73 మందికి వైద్య పరీక్షలతో పాటు మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాంబాబు, వైద్య నిపుణులు హవీలా, మేఘన, రౌఫ్, వినయ్, మనోజ్, రాజమణి, కోఆర్డినేటర్ మాణిక్‌రావు, సీహెచ్ఓ లక్ష్మి, తులసిదాస్, హెచ్ఈఓ నాందేవ్, హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్, సతవ్వ వైద్య సిబ్బంది శిరీష, అదీప్, ఈశ్వర్, గోకుల్, బాపూరావు, కార్యదర్శి కొల శేఖర్, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

యువత నైపుణ్యాలకు పదును పెట్టాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

యువత తమ నైపుణ్యాలకు పదును పెడుతూ ఆసక్తి గల రంగాల్లో ఉన్నతంగా ఎదగాలని జిల్లా పరిషత్ ఛైర్మెన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజనోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులు ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకల్లో కళాకారులు, యువత ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. జానపద గీతాలకు అనుగుణంగా పలువురు కళాకారులు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. స్వామీ వివేకానంద చూపిన మార్గంలో యువత నడుస్తూ ఉన్నతంగా ఎదగాలని ఈ సందర్భంగా శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మెహతో సూచించారు. నైపుణ్యాలను తీర్చిదిద్దుకుంటూ ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్ర స్థాయిలోనూ సత్తా చాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ రాజు, న్యాయ నిర్ణేతలు, కళాకారులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

గత మొన్నటి పార్లమెంట్‌లో ఆవరణలో ఇండియా కూటమికి సంబంధించిన టీఎంసీ పార్లమెంట్ సభ్యుడు కళ్యాణ్ బెనర్జీ, రాజ్యసభ సభ్యులు ఉపరాష్ట్రపతి శ్రీ జగదీప్ దంతర్‌ని కించపరుస్తూ అవహేళన చేశారు. దీనికి గాను ఇండియా కూటమికి కాంగ్రెస్ సంబంధించిన అధ్యక్షులు రాహుల్ గాంధీ దాన్ని వీడియో తీయడం జరిగింది. ఒక ఉపరాష్ట్రపతిని ఈ విధంగా చేయడం అనేది యావత్ భారతదేశానికి కించపరిచే విధంగా ఇండియా కూటమి సభ్యులు దీన్ని ఖండించారు. దీంతో గురువారం ఆదిలాబాద్‌లోని వినాయకచౌక్‌లో నల్ల కండువాలతో ఇండియా కూటమి చిత్రపటాలతో బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ బీజేపీ కోఆర్డినేటర్ వకుళాభరణం ఆధినాథ్, అసెంబ్లీ కన్వీనర్ విజయ బోయర్, పట్టణ అధ్యక్షులు లాలా మున్నా, ప్రధాన కార్యదర్శి వేదవ్యాస్, దినేష్ మాటోలియా, కౌన్సిలర్లు జోగు రవి, సోమ రవి, ఆకుల ప్రవీణ్, రాజేశ్వర్, కృష్ణ యాదవ్, గొర్ల రాము, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

హత్యాయత్నం చేసిన కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

తన కుమారుడిపై హత్యా యత్నానికి పాల్పడిన కేఆర్‌కే కాలనీ కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ కార్యదర్శికి గురువారం ఎంబడి స్వామి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మావల మండల కేంద్రానికి చెందిన నా కుమారుడు ఎంబడి వంశీని ఉద్దేశపూర్వకంగా జీపుతో చంపాలని చూసిన కేఆర్‌కే కాలని కౌన్సిలర్ అతని అనుచరులను కఠినంగా శిక్షించాలని కోరారు.

ఏజెన్సీలో లిక్కర్ మాఫియా..!

- వైన్స్ షాపు నిర్వాహకులే నడిపిస్తున్న బెల్ట్ షాపులు
- గ్రామాభివృద్ధి పేరిట లక్షల టెండర్లు
- అధిక ధరలకు అమ్మకాలు

ఏజన్సీలో లిక్కర్ మాఫియా తమ దందాను విచ్చల విడిగా కొనసాగిస్తున్నారు. గ్రామ గ్రామాన బెల్ట్ షాపులను ఏర్పాటు చేసి ఒక్కో క్వాటర్‌కు రూ.10 నుంచి 20 వరకు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మి అక్రమ సొమ్ము చేసుకుంటున్నారు. అయిన సంభందిత శాఖ అధికారులు మామూలుగా తీసుకోవడం గమనార్హం.



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ఇంద్రవెల్లి (ఈశ్వర్ నగర్), షాప్ నెం.(33)తో పాటు మూత్నూర్‌లో షాప్ నెం.(39)లు లైసెన్స్ దుకాణాలు నడుస్తున్నాయి. అయితే వైన్స్ వ్యాపారస్తులు సిండికేట్‌గా ఏర్పడి తమ అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. వీరిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వీరు గిరిజన గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీ పేరిట అనాధికార టెండర్లను వేసి, బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నారు. మండలంలోని దేవాపూర్, దనోర(బి), గౌరాపూర్ తదితర గ్రామాల్లో లక్షల కొద్ది అనాధికార టెండర్లను నిర్వహించి, తమ దందాను కొనసాగిస్తున్నాడు. మద్యాన్ని ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మి అక్రమ సొమ్ము చేసుకుంటున్నారు. వీటిని అరికట్టాల్సిన సంభందిత శాఖ అధికారులు అటువైపు చూసి చూడనట్లుగా వ్యవరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. పీసా చట్టం ప్రకారం ఏజన్సీలో ఏటువంటి వ్యాపారానికి పీసా కమిటీ తీర్మానం లేనిదే, దందాను నిర్వహించరాదు. అటువంటిది ఈ అక్రమ బెల్ట్ షాపులు ఎలా నిర్వహిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. గత ప్రభుత్వం లైసెన్స్ కలిగిన వైన్స్‌షాపులు సైతం ఊరికి దూరంగా ఉండాలని నిబంధన ఉంది. అటువంటిది ఈ బెల్ట్ షాపులు ప్రధాన రోడ్డుకు పక్కనే మరికొందరు పాఠశాలలు పక్కనే నిర్వహించడం ఎంత వరకు సమంజసం అని అంటున్నారు. వీరు ఎలాంటి నిబంధనలను పాటించక ధనార్జనే ధ్యేయంగా విచ్చల విడిగా తమ అక్రమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగిస్తున్నారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన బెల్ట్ నిర్వాహకులు..

ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో సైతం మండల కేంద్రానికి చెందిన ఓ బెల్ట్‌షాపు నిర్వాహకుడు నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్ముతుండగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి పట్టుకున్న సంగతి విదితమే. దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. వీరి అక్రమ దందా ఎలా కొనసాగుతోందో తెలుస్తుంది.

కొత్త ప్రభుత్వం బెల్ట్ షాపులు మూసేయనుందా..

ఇటీవలే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో వెలిసే బెల్ట్ షాపులను మూసివేస్తామని ప్రకటించడంతో గ్రామీణ ప్రజలు ముఖ్యంగా గృహిణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆ శాఖ అధికారులకు అయినంత తొందరగా ఆదేశాలు జారీచేయాలని పలువురు పేర్కొంటున్నారు. పై విషయంపై అబ్కారీ శాఖ సీఐ మహేందర్ సింగ్‌ను వివరణ కోరగా అది తన దృష్టికి రాలేదని త్వరలోనే బెల్ట్‌షాపు నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొందరు ఇతర మండలాల నుంచి మద్యం బాటిళ్లను తెస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బెల్ట్ షాపులను త్వరలోనే మూసేస్తానని పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరికి వందరోజుల పని కల్పించాలి

- డీఆర్డీఓ విజయలక్ష్మీ
- ఇంకుడు గుంతలను పరిశీలన



నవతెలంగాణ-కుభీర్

ఉపాధిహామి కూలీలైన ప్రతి ఒక్కరికి వంద రోజుల పని కల్పించాలని డీఆర్డీఓ విజయలక్ష్మీ అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామి, ఐకేపీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలో ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి పని కల్పించి, వారికి ఆర్థిక సాయం అందించేలా చూడాలన్నారు. అదే విధంగా పనికి తగ్గట్టుగా కూలీలకు వేతనాలు అందేలా చూడాలన్నారు. పని ప్రదేశంలో కూలీలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. మహిళ సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. మహిళలు ఆర్థికంగా వెనుకబడి ఉండకుండా వారికి తక్కువ వడ్డీతో కూడిన రుణాలను అందించి, వారికి ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేయాలని అన్నారు. అంతకు ముందు రాము నాయక్ తండా ఆశ్రమ పాఠశాలల్లో రూ.60వేలతో నిర్మించిన సామాజిక ఇంకుడు గుంతను పరిశీలించారు. అందులో మెట్ట తామర, జలశుద్ధి మొక్కలు నాటించేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీఎం హరిలాల్ ఐకేపీ ఏపీఎం రమేష్, స్థానిక సర్పంచ్ రాథోడ్ శంకర్, గులాబ్ నాయక్, టెక్నికల్ అసిస్టెంట్ మహేష్, దత్తు, మునీర్, సాగర, ఐకేపీ సిబ్బంది దత్తాత్రి, సరస్వతి, భూమన్న, సీను, ఫీల్డ్ అసిస్టెంట్, సిబ్బంది ఉన్నారు.

తరుగు లేకుండా తూకం.. రైతుల్లో హర్షం

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఈసారి ధాన్యం తూకం ఎలాంటి తరుగు లేకుండా జరపడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నాణ్యమైన ధాన్యాన్ని సైతం మిల్లర్లు, సెంటర్ నిర్వాహకులు కలిసి క్వింటాళుకు 5 నుంచి 8 కిలోల వరకు తప్పులు పేరుతో అక్రమంగా దోచుకునేవారు. పీఏసీఎస్, ఐకేపీ సెంటర్ నిర్వాహకుల తడిపితేనే ధాన్యాన్ని తూకం చేసే దుస్థితి ఉండేది. సెంటర్లలో జరుగుతున్న అక్రమాలు, మిల్లర్ల దోపిడిపై గతంలో రైతులు రోడ్డెక్కినా ఎవరు పట్టించుకోక పోయేది. కొత్త ప్రభుత్వం కొలువు దీరిన క్రమంలో ధాన్యం తూకాల్లో సెంటర్ నిర్వాహకులు ఎలాంటి కోత పెట్టడం లేదు. అక్రమాలకు తావులేకుండా ధాన్యం కొనుగోళ్లు జరుపుతున్నారు. ఈ క్రమంలో రైతులు సైతం ధాన్యంలో తేమశాతం సరిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తేమశాతం 17 వరకు ఉన్న ధాన్యాన్ని సెంటర్ నిర్వాహకులు ఏమాత్రం ఆపకుండా తూకం చేస్తున్నారు. గతంలో సెంటర్ నిర్వాహకులు అనవసరంగా కాలయాపన చేసి రైతులను ఇబ్బంది పెట్టేవారని పేర్కొన్నారు. ఇప్పుడు అలాంటి దుస్థితి లేదని, పలువురు రైతులు తెలిపారు. సమయమంతా కొనుగోళు కేంద్రాల్లోనే వృధా అయ్యేదని తెలిపారు. ఇప్పుడు జాప్యం లేకుండా సాగుతున్న కొనుగోళ్లతో తమకు పొలాల్లో ఇతర పనులు చేసుకోవడానికి అవకాశం ఉందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- చకచకా జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లు



తేమ సరిగా ఉంటే వెంటనే కొనుగోళు చేస్తున్నాం

కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యంలో తేమ శాతం సరిగా ఉంటే వెంటనే తూకం చేసి పంపుతున్నాం. మిల్లర్ కటింగ్ ఇతర ఎలాంటి సమస్యలేదు. హమాలీలు కూడా అందుబాటులో ఉండి పనిచేస్తున్నారు. గతంలో రైతులు ఇబ్బంది పడ్డది వాస్తవమే.



శ్రీకాంత్ సెంటర్ నిర్వాహకుడు, ఖానాపూర్

ఎలాంటి కోత పెట్టడంలేదు

గతంలో మాదిరి ఈసారి ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి కోత పెట్టడం లేదు. ఖాళీ గన్నీ సంచికి సమానంగా ధాన్యం లెక్క కట్టి పట్టీ చేస్తున్నారు. హమాలీ క్వింటాళుకు రూ.38 తీసుకుంటున్నారు. ధాన్యం తూకంలో మాత్రం ఎలాంటి మోసం చేస్తలేరు.



కొండ రమేష్, రైతు

దుప్పట్ల పంపిణీ

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని బ్ల్యూ భీమ్ యూత్ ఆధ్వర్యంలో గురువారం వృద్ధులకు దుప్పట్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్ల్యూ భీమ్ యూత్ అధ్యక్షుడు గొంటిముక్కుల ప్రేమేందర్ మాట్లాడుతూ చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఉష్ణోగ్రతలు తగ్గిపోయి చలి పెరగడంతో మండల కేంద్రంలోని పేద వృద్ధులను గుర్తించి, వారికి ఉడత భక్తిగా దుప్పట్లను పంపిణీ చేసినట్టు తెలిపారు. మానవసేవయే మాధవ సేవగా తనవంతుగా కృషి చేసినట్లు తెలిపారు. నేటి సమాజంలో అన్ని వర్గాల పేదలు ఉంటారని, వారి కోసం ఆర్థికంగా ఉన్న ప్రతి ఒక్కరూ తమ వంతుగా ఏదో ఒక సాయాన్ని అందించాలని కోరారు. అదేవిధంగా నేటి యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి మార్గాన్ని ఎంచుకోవాలన్నారు. దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో శేఖర్, ప్రశాంత్, అశోక్, యూత్ సభ్యులు పలువురు పాల్గొన్నారు.



విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ముథోల్

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని చేతి వృత్తుల వారు సద్వినియోగ పర్చుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, మండల ఇన్‌చార్జి తాటివార్ రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధాని మోదీ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం విశ్వకర్మ యోజన పథకం ద్వారా 18 రకాల కులాల అభ్యున్నతికి బడ్జెట్ కేటాయించారన్నారు. ఈ పథకం ద్వారా చేతి వృత్తుల వారికి శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. అలాగే వివిధ కుల వృత్తుల వారికి ఉచిత పనిముట్లు, వడ్డీతో లక్ష నుంచి మూడు లక్షల వరకు తక్కువ వడ్డీతో రుణ సదుపాయం ఉందన్నారు. పేద ప్రజలను ఆదుకోవడమే లక్ష్యంగా ఈ పథకం మోదీ ప్రవేశ పెట్టారని తెలిపారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా లబ్ధిదారులకే నగదు వస్తుందన్నారు. మండలంలోని అర్హులైన అన్ని కులాల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు టి.రమేష్, శ్రీనివాస్, గంగాధర్, జీవన్, శివనాథ్, గంగాప్రసాద్ పాల్గొన్నారు.

మెట్ట తామర చెట్లు నాటిన అధికారులు



నవతెలంగాణ-ముథోల్

మండలంలోని తరోడా గ్రామంలోని ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్, వెంకటాపురం గ్రామంలోని పాఠశాల ముందర గురువారం ఎంపీడీఓ సురేష్ బాబు, ఏపీఓ శిరీషరెడ్డిలు శుద్ధి చేయండి అనే కార్యక్రమంలో భాగంగా మెట్ట తామర చెట్లను నాటారు. మురికి నిల్వ ఉన్న స్థలాల వద్ద మెట్ట తామర చెట్లు నాటడంతో నీరు శుద్ధి అవుతుందని అన్నారు. అలాగే గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్, పాఠశాలలో విద్యార్థుల హాజరు సంఖ్య తదితర విషయాలు తెలుసుకొని మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలిచ్చారు. అలాగే గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ పరిసరాల చుట్టూ పచ్చని మొక్కలు నాటుతూ పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఉపాధ్యాయులు ఉన్నారు.

బీజేపీ నాయకుల నిరసన

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం దగ్గర గురువారం బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. పార్లమెంట్‌లో సస్పెండ్ అయిన సభ్యులు మాక్ పార్లమెంట్ నిర్వహించి, ఉపరాష్ట్రపతిని అనుసరిస్తూ కాంగ్రెస్ నాయకులు వీడియో తీయడంపై నిరసనగా గురువారం మండల బీజేపీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ డౌన్ డౌన్ సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్‌చాంద మండల బీజేపీ అధ్యక్షులు పొలాస గోవర్ధన్, ఉపాధ్యక్షులు గుడ్ల రంజిత్, మండల ప్రధాన కార్యదర్శి అల్లూరి రాజు, నాగుల రాజు, కిసాన్ మోర్చా రాజేశ్వర్, ఏలేశ్వర్ గంగాధర్, శంకర్, హుస్సేన్ పాల్గొన్నారు.

ఘనంగా ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

జిల్లా కేంద్రంలో వైఎస్సార్ సీపీ అధినేత, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బెజ్జంకి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా అభిమానులు సర్పం రాహుల్‌రెడ్డి, కృష్ణంరాజు, బండారి హరీష్, రుద్రరాపు మహేష్, ఉగ్గే శ్రీను, విజయ్, సైబాజ్, శ్రీను పాల్గొన్నారు.

పశువులపై పిచ్చికుక్క దాడి

నవతెలంగాణ-ముథోల్

మండలంలోని పిప్రి గ్రామంలో బుధవారం రాత్రి ఓ పిచ్చికుక్క తొమ్మిది పశువులపై దాడి చేసి గాయపరిచింది. గురువారం ఎడ్‌బిడ్ పశు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ తన సిబ్బందితో వెళ్లి గాయపడిన పశువులకు టీకాలు వేసి చికిత్స అందించారు. గ్రామంలో ఊర కుక్కల బెడద నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆయన వెంట గోపాలమిత్ర శివ, గ్రామస్తులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం | డిసెంబర్ 22, 2023 | www.navatelangana.com

సీనియర్ సిటిజన్స్ సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్


సమావేశమైన సీనియర్ సిటిజన్స్ సంఘం సభ్యులు

తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ మాట్లాడుతూ సంఘం ఏడు వసంతాలు పూర్తి చేసుకొని ఎనిమిదో వసంతంలో అడుగు పెడుతోందని, సంఘం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టి వయోధికులకు ఆసరాగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా వయోధికులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి పూర్ణచందర్‌రావు, నారాయణ, కలికోట రమణయ్య, ఎల్లాగౌడ్, దేవయ్య, బంగారు బాబు, మార్త ఉపేందర్, వాహబ్, ప్రకాష్, రామయ్య సీతారాం, నర్సయ్య పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన సిబ్బందికి గ్రాట్యూటీ చెక్ అందజేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో పనిచేసే స్వచ్ఛంద పదవి విరమణ పొందిన హరిత, కరుణశ్రీలకు పాఠశాల కమిటీ అధ్యక్షుడు చిలువేరు వెంకన్న, ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వర్‌లు గ్రాట్యూటీ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో పనిచేసే సిబ్బంది సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వేణుగోపాల్, సహ కార్యదర్శి మధుకర్, కల్లూరి సంతోష్, జంజిరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంత్ శిరోమణి జగన్నాథ్ మహారాజ్ బాటలో నడవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సంత్ శిరోమణి శ్రీ సంతాజి జగన్నాథ్ మహారాజ్ ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయుడని ఆయన బాటలో ప్రతి ఒక్కరు నడవాలని అఖిల గాండ్ల తెలి కుల సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు, కుమురంభీం జిల్లా అధ్యక్షులు హిప్రే సందీప్ అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో సంత్ శిరోమణి శీ సంతాజీ జగన్నాథ్ మహారాజ్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాజ్ అందరికి ఆదర్శప్రాయుడని, ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు సెండే మురళీకృష్ణ, బాబాపూర్ అధ్యక్షులు కవల్కర్ ఆనందరావు, దస్నాపూర్ ఉపాధ్యక్షులు తపాసే పోచన్న, కమిటీ సభ్యులు హారందరే దశరథ్, గాండ్ల తెలి కులస్తులు హారందరే లక్ష్మణ్ స్వామి, పెంటు, సదు, సకారం, గణపతి, మారుతి, నాందేవ్, శంకర్ పాల్గొన్నారు.

జడ్పీ ఛైర్మెన్ గిరిజన మహిళకు కేటాయించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నిబంధన మేరకు జెడ్పీ ఛైర్మెన్ గిరిజన మహిళకు కేటాయించాలని బహుజన ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ రజిహైదర్ అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న కోవలక్ష్మి ఎమ్మెల్యేగా ఎన్నికకావడంతో పదవికి రాజీనామా చేశారని తెలిపారు. అయితే జెడ్పీ చైర్‌పర్సన్ పదవి గిరిజన మహిళకు కేటాయించబడిందని గుర్తు చేశారు. దానికి విరుద్ధంగా వైస్ చైర్మెన్ కోనేరు కృష్ణను ఛైర్మెన్‌గా ఎంపిక చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. వెంటనే ఎంపికను రద్దుచేసి గిరిజన మహిళను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కే.కిషోర్, బీజేపీ జిల్లా నాయకులు జగన్, న్యాయవాది గణేష్ పాల్గొన్నారు.

రెండో రోజు అదే జోరు

- కొనసాగుతున్న రాష్ట్రస్థాయి స్థాయి ఖోఖో పోటీలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పట్టణంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడ పాఠశాలలో అండర్-14 బాలబాలికల ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలు రెండవ రోజు నువ్వా నేనా అన్నట్లు జరిగాయి. గురువారం గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఆర్.రమాదేవి పోటీలను ప్రారంభించారు. వీరితో పాటు ఏటీడీఓ క్షేత్రయ్య, వాంకిడి సీఐ శ్రీనివాస్, ఏసీఎంఓ ఉద్ధవ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సాంబశివరావు, జీసీసీ మేనేజర్ పాపారావు, స్పోర్ట్స్ ఆఫీసర్ మీనారెడ్డి, లయన్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆరిఫ్, శంకర్, పేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేందర్, కృష్ణమూర్తి, అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సత్ల శంకర్, కోశాధికారి గుండం లక్ష్మణ్, అథ్లెటిక్స్ శిక్షకుడు విద్యాసాగర్, పోటీల అబ్జర్వర్ రమేష్, రామయ్య పాల్గొన్నారు.

అటవీ అనుమతుల కోసం కేంద్ర మంత్రికి వినతి

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని దింద వాగుపై బ్రిడ్జి నిర్మాణం అటవీ శాఖ అనుమతులు లేని కారణంగా అగిపోయిందని, ఈ విషయంలో కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌ను ఎంపీ సోయంరావ్‌తో కలిసి వినతిపత్రం అందించామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దింద వాగుపై హై లెవెల్ వంతెనతో పాటు, కేతిని నుండి దింద వరకు రోడ్డు నిర్మించేందుకు అడ్డుకున్న అటవీ అనుమతుల విషయమై కేంద్రమంత్రిని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు సోయం బాబురావుతో విన్నవించడం జరిగిందన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు రామగోని తిరుపతి గౌడ్, నాయకులు కొంపర్ బాలాజీ, లచ్చన్న పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా పత్తికొంటున్న వారిపై

చర్యలు తీసుకోవాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్


మార్కెట్ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో అనుమతులు లేకుండా పత్తి పంటను కొనుగోలు చేస్తూ కాంటాలు ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ మార్కెట్ పరిధిలోని వాంకిడి, కెరమెరి, ఆసిఫాబాద్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు పత్తి దళారులు రైతుల దగ్గరి నుండి తక్కువ ధరలకే పత్తి కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అమాయక రైతులను తూకంలో మోసం చేస్తూ తక్కువ ధరలకే రైతుల దగ్గర పత్తి కొనుగోలు చేసి ఆర్థికంగా మోసం చేస్తున్నారన్నారు. సీసీఐలో రూ. 7020 మద్దతు ధర ఉంటే దళారులు రూ. 6500 రైతుల దగ్గర కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. వెంటనే మార్కెట్ కమిటీ కార్యదర్శి తనిఖీలు చేసి అనుమతులు లేకుండా పత్తి కొనుగోలు చేస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గొడిసెల కార్తిక్, రాజేందర్ పాల్గొన్నారు.

పాఠశాల భవనానికి రోడ్డెక్కిన విద్యార్థులు


రాస్తారోకో నిర్వహిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

నవతెలంగాణ-చింతలమానెపల్లి

పక్క పాఠశాల భవనం కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు రోడ్డెక్కారు. గురువారం మండలంలోని డబ్బా ఎక్స్ రోడ్ వద్ద పాఠశాల పక్క భవనం ఏర్పాటు చేయాలని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్క కూడా ప్రాజెక్టుకు నిర్మించిండంతో ధరంపల్లి గ్రామం ముంపుకు గురవడంతో డబ్బా ఎక్స్ రోడ్ వద్ద ఆ గ్రామస్తులు స్థిరపడ్డామన్నారు. అక్కడ స్థిరపడి తొమ్మిదేండ్లు అవుతున్న నేటికి పాఠాశాలకు పక్క భవనం లేక పోవడంతో మండల విద్యాధికారి సోమయ్య చొరవ తీసుకొని అద్దె రేకుల భవనం ఏర్పాటు చేసి నెలకు రూ.1200 అద్దె చెల్లిస్తామని తీర్మానం చేసి పాఠశాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. ఆ రేకుల షెడ్డు భవనానికి అద్దె సక్రమంగా చెల్లించకపోవడంతో ఇంటి యజమానురాలు తాళం వేసిందన్నారు. తమకు పక్క భవనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై సురేష్, చింతలమానపల్లి జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం జయరాజ్ అక్కడి చేరుకొని ఇంటి యజమానురాలితో మాట్లాడి అద్దె చెల్లించడంతో ప్రస్తుత సమస్యను పరిష్కరించారు. పక్క భవనం కోసం ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆందోళన విరమించారు.

12న ఛలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలి


పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఉచిత విద్య, ఉపాధి కల్పనకు జనవరి 12న చేపట్టే ఛలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడె భీమేష్ కోరారు. గురువారం కాగజ్‌నగర్‌లో దీనికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అందరికీ ఉచిత విద్య, ఉపాధి కోసం 16 విద్యార్థి సంఘాలు సంయుక్తంగా ఛలో పార్లమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం మూడు శాతం నిధులు మాత్రమే కేటాయిస్తున్నారని, రాబోయే బడ్జెట్ సమావేశాల్లో 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ విద్యార్థులకు ఇచ్చే జాతీయ స్థాయి ఫెలోషిప్‌లో కోత విధించడంతో విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయన్నారు. ఛలో పార్లమెంట్ కార్యక్రమానికి విద్యార్థులు, ప్రజాస్వామికవాదులు మద్దతు తెలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ సాయికృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు నితీష్, మండల నాయకులు నవీన్, సాయి, మహేష్, అంజన్న, కార్తీక్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన


కాగజ్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌ను అవహేళన చేసిన ఎంపీ కళ్యాణ్ బెనర్జీ వైఖరిపై బీజేపీ నాయకులు నిరసన చేపట్టారు. గురువారం రాజీవ్ చౌక్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ ఉప రాష్ట్రపతికి ఎంపీ కళ్యాణ్ బెనర్జీతో పాటు కాంగ్రెస్ నాయకులు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సంప్రదాయాలను మంటగలిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చన్నపురి గణపతి, అరుణ్‌లోయ, సిందం శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్, శ్రీదేవి, పారెపల్లి రాణి, చిప్ప మౌనిక, సౌరభ్, నానాజి పాల్గొన్నారు.

కౌటాల: పార్లమెంట్‌లో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా గురువారం బీజేపీ నాయకులు మండల కేంద్రంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు బండి రాజేందర్ గౌడ్, నరూలె వానుపటేల్, పెద్దపెల్లి భీమన్న పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండల కేంద్రంలోని చత్రపతి శివాజీ చౌరస్తాలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పిలుపు మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం ఆధ్వర్యంలో ఐఎన్‌డీఐ అలైన్స్ ఎంపీలు, కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ రాజ్యసభ స్పీకర్, భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌కు వెంటనే క్షమాపణలు చెప్పాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాజ్యసభ స్పీకర్, ఉప రాష్ట్రపతి జగదీప్‌ని టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ అగౌరవంగా ఎగతాళి చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఎంపీ అవహేళన చేస్తూ ఉంటే దానికి వత్తాసు పలికిన ఐఎన్‌డీఐ ఎంపీలు, రాహుల్ గాంధీ ఈ వీడియోను వెకిలిగా చిత్రీకరించడం సిగ్గుచేటని, పార్లమెంట్ సాంప్రదాయాలను మంటగలపడమే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప రాష్ట్రపతికి క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామగొని తిరుపతి గౌడ్, నాయకులు శ్రీమన్ నారాయణ, చాపల సుధాకర్, చందు, కొంపల్లి బాలాజీ, బాబురావు పాల్గొన్నారు.




కౌటాల:


చింతలమానేపల్లి :

డిజిటల్ లావాదేవీలపై అవగాహన



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని చెడ్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం గ్రామీణ బ్యాంకు రాస్పెల్లి శాఖ మేనేజర్ సాయిచరణ్ ఆధ్వర్యంలో కళాజాత బృందం ద్వారా బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డిజిటల్ లావాదేవీలు, ఇన్సూరెన్స్, సైబర్ నేరాలు, బ్యాంకు ఇచ్చే రుణాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాంకులో ఎస్‌బీఐ ఇన్సూరెన్స్, సీఎస్‌బీవై, టీజేజేడీవై వంటి ఇన్సూరెన్స్‌లపై విద్యార్థులకు తెలియజేస్తూ తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి జగదీష్, బ్యాంకు సిబ్బంది చంద్రశేఖర్, కళాజాత బృందం సభ్యులు, ఉపాధ్యాయులు ఫరూఖ్, గంగారాం, నరహరి పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారంపై శ్రద్ధ తీసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని నాబార్డ్ డీడీఎం వీరభద్రుడు సూచించారు. మండలంలోని పర్సనంబాల గ్రామంలో నాబార్డ్ ఆర్థిక సహాయంతో వాటర్ షెడ్ వాసన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గిరిజనులలో ఎక్కువగా రక్తహీనతతో బాదపడుతున్నారన్నారు. పౌష్టికాహారంపై ఎక్కువ శ్రద్ధ వహించాలని సూచించారు. అప్పుడే రక్తహీనత నివారణ సాధ్యమవుతుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకుని అవసరమైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. దీనివల్ల పుట్టే పిల్లలకు కూడా ఇబ్బందులు కలగకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోద, ఏఎన్ఎం సుశీల, వాసన్ సంస్థ సభ్యులు జయవర్ధన్, తిరుపతి, భీమ్‌రావ్ పాల్గొన్నారు.

పద్మశాలి కుటుంబ సభ్యుల సభ్యత్వ నమోదు పూర్తి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మండలంలో పద్మశాలిల కుటుంబ వివరాలు, సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారంతో ముగిసిందని జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు ప్రకటనలో పేర్కొన్నారు. ఆసిఫాబాద్ మండలంలో సభ్యత్వ నమోదును 11 నుండి పది రోజుల పాటు వివరాలు సేకరించామన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. మండలంలో సభ్యత్వ నమోదుకు సంబంధించిన వివరాలు ఇవ్వానివారు అనుమాండ్ల శ్రీకాంత్ 9866335768, జంజిరాల సంజీవ్ 9989803489ను సంప్రదించాలని కోరారు.

టెక్నికల్ కోర్స్ శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నిరుద్యోగ యువత టెక్నికల్ కోర్సు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా టాస్క్ రీజనల్ సెంటర్ మేనేజర్ సాయికుమార్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టెక్నికల్ కోర్సులో భాగంగా సీసీ ప్లస్, జావా, పైతాన్ వంటి మరిన్ని టెక్నికల్ కోర్సుల శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ టెక్నికల్ కోర్సు శిక్షణలు 1 జనవరి నుంచి ప్రారంభం అవుతాయని అందుకోసం 31లోపు టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఎస్‌యూఆర్ఎల్.ఎల్ఐ/ఓఎంఎఫ్‌కేఆర్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే సెల్: 9502786438 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

జంతర్ మంతర్ ధర్నాలో జిల్లా నాయకులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటు సమావేశంలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో వర్గీకరణ చేస్తానని గతంలో బీజేపీ హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చలేదన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేసే కుట్ర చేసిందని ఆరోపించారు. గతంలో ఇచ్చిన హామీ నేపథ్యంలో ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అంబాల రవి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మన ధర్మయ్య, రాష్ట్ర కార్యదర్శి శనివారం మల్లేష్, ఎమ్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బొమ్మన శ్రీనివాస్, మోతే లక్ష్మణ్, నరేష్, సముద్రాల తిరుపతి పాల్గొన్నారు.

కార్మికుల పక్షాన నిలబడేది కమ్యూనిస్టులే

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

కార్మికుల పక్షాన నిలబడేది కమ్యూనిస్టులేనని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 26 డిసెంబర్1925న పార్టీ కాన్పూర్‌లో ఆవిర్భావించిందన్నారు. అప్పటి నుంచి కార్మికులు, కార్షకులు, పేదల పక్షాన ఉద్యమించి హక్కులను సాధించామని పేర్కొన్నారు. పార్టీ పోరాటలను ప్రజలకు తెలియజేసేల ఈనెల 26 వరకు ప్రతి గ్రామంలో పార్టీ జెండాలను ఆవిష్కరించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యురాలు ముడుపు నళిని రెడ్డి, పట్టణ కార్యదర్శి ఎస్ అరుణ్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు షేక్ పాషా, పెద్దింటి సత్యనారాయణ, అమీనా బేగం, తార దళిత సంఘం జిల్లా అధ్యక్షులు కాంబ్లే రాందాస్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఖండాల గణేష్, పార్టీ సీనియర్ నాయకులు బుర్రి సట్వాజీ, బెజ్జంకి నర్సింగరావు, బత్తుల గంగారెడ్డి, కన్నోజి స్వామి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

నవతెలంగాణ-జన్నారం



పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని జన్నారం మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ జాడీ గంగాధర్ పేర్కొన్నారు. గురువారం తిమ్మాపూర్ గ్రామపంచాయతీలోని పలు కాలనీల్లో మురికి కాలువలను శుభ్రం చేయించారు. ప్రతి ఇంటింటికి ఉన్న ఇంకుడు గుంతలను వాడుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా తమ ఇంటి పన్నులను గ్రామపంచాయతీకి చెల్లించాలని సూచించారు. కార్యదర్శి లావణ్య పాల్గొన్నారు.

తాండూర్ పంచాయతీలో పడకేసిన పారిశుధ్యం



నవతెలంగాణ-తాండూర్

తాండూర్ మేజర్ గ్రామపంచాయతీలో పారిశుధ్యం పడకేసింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి అధిక నిధులు సమకూరుతున్న అధికారుల నిర్లక్ష్యం, నాయకుల అలసత్వ ధోరణి కారణంగా కంపుకొడుతోంది. సుభద్ర కాలనీ, మసీదు వాడ, ఎస్సీ కాలనీలో పారిశుధ్య పనులు నిర్వహించకపోవడంతో మురుకు కాలువలు అస్తవ్యస్తంగా మారి దుర్గం వెదజల్లుతుంది. దీంతో దోమలు, పందులకు నివాసంగా మారి వ్యాధులకు కారణం అవుతున్న పట్టించుకునే వారే కరువయ్యారు. పంచాయతీలో 18 మంది ఎంపీడబ్ల్యూఓ వర్కర్లు ఉండగా అదనంగా 14 మందిని రోజువారి పారిశుధ్య కార్మికులను నియామించారు. అయినప్పటికీ పారిశ్య పనులు సక్రమంగా జగరడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. మురికి కాలువలు చెత్తాచెదారంతో పేరుకుపోయి దోమలకు ఆవాసాలుగా మారి రోగాల బారిన పడుతున్నారు. మురికి కాలువల్లోని బురదను ఎప్పటికప్పుడు తీసి శుభ్రపరచకపోవడంతో రోడ్లపై మురికి నీరు ప్రవహిస్తుంది. ప్రతి మాసంలో సమీక్షా సమావేశాలు, పంచాయితీల తనిఖీలు చేపట్టే డివిజన్ మండల స్థాయి అధికారులు పంచాయితీల పారిశుధ్యంపై శ్రద్ధ వహించకపోవడం పట్ల ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పంచాయితీలకు పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ అధికారులకు పారిశుధ్యంపై లేదని మండిపడుతున్నారు. సర్పంచ్ అంజిబాబు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అతని స్థానంలో ఇన్‌చార్జి సర్పంచ్ వ్యవస్థ కొనసాగుతుంది. ఇన్‌చార్జి పాలనలో అస్తవ్యస్తమైన పరిపాలన జరుగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నిరుపయోగంగా డంపింగ్ యార్డ్

చెత్త సేకరించి వేరుచేసి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు నిరుపయోగంగా ఉంది. తాండూర్ పంచాయతీలో సేకరించిన చెత్తను మాదారం రోడ్డు సమీపంలోని స్మశాన వాటిక వద్ద నగరం రోడ్డు వద్ద వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దానికి తోడు తాండూర్ ఐబీ ప్రాంతంలోని చికెన్ సెంటర్‌ల యజమానులు వ్యర్థాలను సైతం స్మశాన వాటిక వద్దే వదులుతున్నారు. స్మశాన వాటిక సమీపంలో కోళ్ల వ్యర్థాలు, పంచాయితీలోని చెత్త చెదారం వేయటంతో దహన సంస్కారాలకు వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కూడా ఇటు వైపు చూడకపోవడం దారుణమన్నారు. అధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణతో పాటు డంపింగ్‌యార్డును వినియోగంలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి కృషి చేయాలి

సురభి ఆగామారావు స్మశాన వాటిక నిర్మాణ కర్త



తాండూరు మండల కేంద్రంలోని తంగళ్ళపల్లి రాజీవ్ నగర్ సుభద్ర కాలనీ ప్రజల సౌకర్యార్థం మాదారం రోడ్డు వద్ద స్మశాన వాటిక నిర్మించాం. స్మశాన వాటిక నిర్మాణానికి లయన్స్ క్లబ్ సభ్యులతో పాటు స్థానికులు సహకరించారు. ప్రస్తుతం పంచాయితీలో సేకరించిన చెత్త, వ్యర్థాలను స్మశాన వాటిక ఆవరణలో వేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాతలు నిర్మించిన స్మశాన వాటికను గ్రామపంచాయతీ ఆస్తిగా భావించాలి అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించాలి. పంచాయతీ అధికారులు సేకరించిన చెత్తను వ్యర్థాలను డంపింగ్ యార్డ్‌కు తరలించి వర్మీ కంపోస్ట్ తయారీకి వినియోగించాలి. పంచాయతీ అధికారులు శ్రద్ధ వహించి పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలి.

మహాలక్ష్మి పథకాన్ని రద్దుచేసి ఆటో డ్రైవర్లను కాపాడాలి

- డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాపిడి సురేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవచ్చిన మహాలక్ష్మి పథకాన్ని వెంటనే రద్దుచేసి ఆటోడ్రైవర్లను కాపాడాలని డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాపిడి సురేష్ డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం రద్దు చేయాలని కోరుతూ గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం వల్ల ఆటో డ్రైవర్లకు గిరాకీ లేకుండా పోయిందని, దీంతో ఆటోపై ఆధారపడి జీవించే డ్రైవర్ల పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. గతంలో ఆటోలలో ఎక్కువగా మహిళలు తిరిగేవారని ఇప్పుడు వారికి ఉచిత ప్రయాణానికి ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో గిరాకీ తగ్గిందన్నారు. వెంటనే పథకాన్ని రద్దు చేసి ఆటోడ్రైవర్లను రక్షించాలని కోరారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునర్ సమీక్షించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు సాగర్, సంతోష్, రాజు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మెన్ పదవికి ఎన్నికలు నిర్వహించాలి

- 27న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ చైర్మెన్ పదవికి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న బీఎస్పీ, ఆదివాసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు వివిధ సంఘాల నాయకులు తెలిపారు. గురువారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జెడ్పీ చైర్మెన్ పదవిని ఎస్టీ మహిళకు కేటాయిస్తే ఆ స్థానాన్ని అగ్రవర్ణానికి చెందిన వ్యక్తికి కట్టబెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. షెడ్యూల్ ప్రాంతాలలో సర్వాధికారాలు ఆదివాసులకు ఉన్నప్పుడు గిరినజేతరునికి పదవి అప్పుచెప్పారని, వెంటనే ఆదివాసీ మహిళకు పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఎస్పీతో పాటు ఆదివాసీ సంక్షేమ పరిషత్, తుడుందెబ్బ, గొండ్వానా, ఆదివాసీ కోయసంఘం, విద్యార్థి, స్టూడెంట్ ఫెడరేషన్‌లతో కలిసి ఈ నెల 27న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మెన్ సిడాం గణపతి, ప్రజాసంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ సోయం చిన్నయ్య, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షులు గెడం నగేష్, నాయకులు తలండి భిక్షపతి, డబ్బా ప్రకాష్, నక్క మనోహర్, తన్నీరు పోశం, రేణికుంట్ల శ్రీనివాస్, శోభన్ పాల్గొన్నారు.

నేడు జిల్లా కేంద్రంలో జాబ్ మేళా

నవతెలంగాణ ఆసిఫాబాద్

నేడు అనగా శుక్రవారం ఆసిఫాబాద్ లోని ప్రధానమంత్రి కౌశల్ కేంద్రంలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎ.రవికృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బయోఫర్టిలైజర్ లిమిటెడ్ కంపెనీ నందు 60 ఖాలీలకు గాను జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని, జాబ్ మేళాలో పాల్గొనే వారు ఇంటర్/వ్యవసాయ డిప్లొమా/బీ ఎస్సీ అగ్రికల్చర్ కల వారు తమ ధ్రువీకరణ పత్రాలతో మాతశ్రీ కాలేజ్ ఎదురుగా గల కౌశల్ కేంద్రంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేస్తుంది



నవతెలంగాణ-జైపూర్

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పాటు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామలు అన్ని తప్పకుండా అమలు చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కృషి ఫలితంగా సింగరేణి ఉద్యోగాల్లో 80 శాతం స్థానికులకు ఇవ్వనున్నట్లు యాజమాన్యం ప్రకటించడంతో గురువారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫయాజోద్దీన్‌తో కలిసి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతోనే హామీల అమలుకు శ్రీకారం చుట్టిందని, ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి సింగరేణి ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని కోరడం జరిగిందని తెలిపారు. ఫలితంగా సింగరేణి యాజమాన్యం స్పందించి స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నామని సంస్థ డైరెక్టర్ ప్రకటించడం జరిగిందని, ఇచ్చిన హామీకి కట్టుబడి వివేక్ వెంకటస్వామి సింగరేణిలో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించగలిగారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలో గల ప్రభావిత గ్రామ పంచాయతీలతో పాటు పరిసర గ్రామాలకు చెందిన వారు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు పాలాభిషేకం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, కల్కి రమేష్, నామాల తిరుపతి, పాపిరెడ్డి పాల్గొన్నారు.

'పోరాటాలు చేసిన చరిత్ర ఐఎన్టీయూసీది'



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కార్మికుల హక్కుల కోసం సమ్మెలు, పోరాటాలు చేసిన చరిత్ర ఐఎన్టీయూసీకి ఉందని ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు అన్నారు. గురువారం ఆర్కే 7 గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇతర కార్మిక సంఘాలు ఐఎన్టీయూసీని విమర్శించడం విడ్డూరంగా ఉందని, గడిచిన పదేండ్లుగా కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేదని, 17 సంవత్సరాలుగా గుర్తింపు హోదా కూడా సింగరేణిలో లేదని గుర్తు చేశారు. ఐఎన్టీయూసీని గెలిపిస్తే ప్రభుత్వ అనుకూల విధానాలను కొనసాగిస్తుందని వారు విషప్రచారం చేస్తున్నార అన్నారు. అలాంటి దుష్ప్రచరాలను కార్మికులు నమ్మద్దని పేర్కొన్నారు. కార్మికులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కరం కోసం ఐఎన్టీయూసీ ఉద్యమిస్తుందన్నారు. ఈ సింగరేణిలో రాజకీయ జోక్యం లేకుండా చర్యలు తీసుకుంటామని, ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణను అడ్డుకుంటామని, ప్రధానంగా ఐఎన్టీయూసీ విడుదల చేసిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి కార్మికుల ముందు నిలబడతామన్నారు. మేనిఫెస్టోను కాపీ కొట్టిన ఇతర సంఘాలు వారి హామీలను నెరవేర్చగలవోలేదో కార్మికులు ఒకసారి ఆలోచించి గుర్తింపు సంఘ ఎన్నికల్లో ఐఎన్టీయూసీ గడియారం గుర్తుకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు కలవేన శ్యామ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు గరిగే స్వామి, ఐరెడ్డి తిరుపతిరెడ్డి, జాతీయ సమితి సభ్యులు భీమ్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బీమ్ రవి, ఉపాధ్యక్షులు నర్సింగ్, కేంద్ర కార్యదర్శులు మోతె రాఘవరెడ్డి, లాగల శ్రీనివాస్, కాలువ శ్రీనివాస్, పేరం రమేష్, ఏరియా కార్యదర్శులు చంద్రమోహన్, ప్రేమ్ కుమార్, అన్ రెడ్డి సమ్మిరెడ్డి, ట్రేడ్స్ మెన్స్ ఇన్‌చార్జి విజయపాల్ రెడ్డి, నాయకులు సుధాకర్ రెడ్డి, రమేష్, నాయకులు శ్రీకాంత్, వెంకటేష్, జీవన్ రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెర్క్స్‌పేపై ఇన్‌కమ్ టాక్స్‌ను యాజమాన్యంతో చెల్లింపజేస్తాం



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)ని గెలిపిస్తే పెర్క్స్‌పేపై ఇన్‌కామ్ టాక్స్‌ను యాజమాన్యంతో చెల్లింపజేస్తామని ఏరియా బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా అన్నారు. గురువారం ఆర్కే న్యూ టేక్ గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్యతో హాజరై మాట్లాడారు. ప్రతి కార్మికుడికి 250 గజాలతో పాటు వడ్డీ లేని రూ. 20 లక్షల రుణాన్ని ఇప్పిస్తామన్నారు. గత గుర్తింపు సంఘం నిర్లక్ష్యం వల్ల సింగరేణిలో పెరిగిపోయిన కాంట్రాక్టీకరణను అడ్డుకుంటామని, నూతన అండర్ గ్రౌండ్ గనులను తీసుకువచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, సింగరేణి స్కూల్స్‌లో కార్మిక పిల్లలకు సీబీఎస్ఈ సిలబస్ ద్వారా నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తామన్నారు. గత గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచిన టీబీజీకేఎస్ చేతకానితనం వల్ల సింగరేణిలో కాంట్రాక్టీకరణ పెరిగి సంస్థ మనగడే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. గతంలో ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ఓడిపోయిన ప్రతిక్షణం కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యలపైన పోరాటాలు నిర్వహించిందన్నారు. కొన్ని సర్కారు సంఘాలు 11 సంవత్సరాలలో ఏ ఒక్కరోజు కూడా కార్మికుల సమస్యలపై స్పందించని నాయకులు రాష్ట్ర ప్రభుత్వంలో మార్పు రావడం వల్ల మళ్లీ కార్మికులను మభ్యపెట్టి ఓట్లు దండుకోవాలని చూస్తుయని ఆరోపించారు. గత గుర్తింపు సంఘంలో పనిచేసిన నాయకులు ప్రస్తుతం కండువాలు మార్చుకొని మళ్లీ కార్మికులను మోసం చేయడానికి వస్తున్నారన్నారు. ఈ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీని ఆదరించాలన్నారు. అనంతరం ఆర్కే న్యూ టేక్ గని కార్మికులు ఏఐటీయూసీలో చేరాగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, బ్రాంచ్ ఆఫీస్ బేరర్స్ సంపత్, ఫిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, గజ్జి రమేష్, అఫ్రోజ్ ఖాన్, సదానందం, యాదగిరి, సందీప్, అజయ్, కొట్టే శంకరయ్య, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతికి రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి

నవ తెలంగాణ-మందమర్రి

పార్లమెంట్ సమావేశంలో కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌పై చేసిన అనుచిత వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే ఉప రాష్ట్రపతికి రాహుల్ గాంధీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీజేపీ పట్టణ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఉపరాష్ట్రపతిపై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ మార్త కుమారస్వామి, రాంటెంకి దుర్గరాజు, మేకల రమేష్, శనిగారపు సతీష్, దాసరి వినోద్ పాల్గొన్నారు.



మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-తాండూర్

అవెన్యూ ప్లాంటేషన్లలోని మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో గ్రామపంచాయతీలో కూలీల సంఖ్య 100కి తగ్గకుండా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్ల ను ఆదేశించారు. ఉపాధి కూలీలకు సరిపడా పనులు కల్పించే విధంగా పనులను గుర్తించాలన్నారు. వచ్చే సంవత్సరానికి నర్సరీ ఏర్పాటు కోసం నర్సరీ బాగ్‌లను నింపి విత్తనాలు నాటాలని ఆదేశించారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలని తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవనాలు పనులు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీలలో నిరంతరం పారిశుధ్య పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. ఇంటి పన్నులు 100శాతం వసూలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ సత్యనారాయణ, ఏపీఓ నంద కుమార్, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సింగరేణిలో ఉద్యోగావకాశాలు కల్పించాలి

- హెచ్ఎంఎస్ నాయకులు తిప్పారపు సారయ్య



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి ఉద్యోగాల్లో జీఓ నెం.316 ప్రకారం 80 :20 నిష్పత్తితో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షులు తిప్పారపు సారయ్య డిమాండ్ చేశారు. గురువారం ఇందారం-1ఏ, ఇందారం ఓపన్ కాస్ట్ గని కార్మికులతో పిట్ కార్యదర్శి కొమురయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, టీబీజీకేఎస్ సంఘాల చేతకాని తనం వల్ల ఇందారం ఓపన్‌కాస్ట్, సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ (ఎస్టీపీపీ)ప్రయివేటు వారి చేతుల్లోకి వెళ్లిందని విమర్శించారు. సింగరేణి అభివృద్ధి కాంక్షించి విలువైన వ్యవసాయ భూములు సమకూర్చిన పరిసర గ్రామాల వారు ఉపాధికి దూరమైన స్థానికులకు కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీహార్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన బాండెండ్ లేబర్ తీసుకొచ్చి పవర్ ప్లాంట్ పనుల్లో పెట్టుకుంటున్నారని ఆరోపించారు. విద్యుత్ ఉత్పత్తి నిబంధనల ప్రకారం ఒక్క మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి కనీసం ఐదుగురు పర్మనెంట్ ఉద్యోగులు పని చేయాల్సివుండగా ఇక్కడి 1200 మెగావాట్ల ప్లాంట్‌లో 6 వేల మంది పర్మనెంట్ ఉద్యోగులు ఉండాల్సిన స్థానంలో కేవలం 120 మందితో పని చేయిస్తున్నారని అన్నారు. అదేవిధంగా ఇందారం ఓపన్‌కాస్ట్‌లో వంద మంది సింగరేణి పర్మనెంట్ ఉద్యోగులు ఉండగా 500 మంది ప్రయివేట్ కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారని పేర్కొన్నారు. సంస్థ అవసరాల కోసం భూములు సమకూర్చిన పరిసర గ్రామాల నిరుద్యోగులకు పర్మనెంట్ ఉద్యోగాలతో పాటు కాంట్రాక్టు ఉద్యోగాలు ఇవ్వకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, టీబీజీకేఎస్ కార్మిక సంఘాల చేతకాని తనం వల్ల బొగ్గు బావులు మూతబడటం, బొగ్గు ఆధారిత పరిశ్రమలు రాకపోవడం, సింగరేణి పాఠశాలలు, ఆస్పత్రులు, అంబులెన్స్‌లు బందు చేయడం జరుగుతుందని ఆరోపించారు. అదేవిధంగా డిస్మిస్ పేరుతో వేలాది మందిని సంస్థ నుండి వెళ్లగొట్టడం జరిగిందని, ఆస్పత్రులను ఆధునీకరించక పోవడం, నిపుణులైన వైద్యులను నియమించకపోవడం, మెడికల్ దందాలు, ప్రయివేటీకరణ, న్యూస్టాండింగ్ ఆర్డర్ పేరుతో కార్మికులను వేదింపులకు గురి చేసినటువంటి సంఘటనలు అనేకంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, టీబీజీకేఎస్ సంఘాల వ్యవహరించిన తీరును దృష్టిలో పెట్టుకుని కార్మికుల కోసం నిరంతరం నిజాయితీగా కొట్లాడే హెచ్ఎంఎస్ సంఘాలన్ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి అనిల్ రెడ్డి, నాయకులు దుర్గం లక్ష్మన్, కంబాల నర్సయ్య, ఎస్‌కే వలి, కండె సమ్మన్న, అశోక్, వంశీ, ఎస్టీపీపీ నాయకుల సాయికృష్ణారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, కొట్టె సురేష్, మైకాంత్, రహమాన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

30న లోక్‌అదాలత్

నవతెలంగాణ-తాండూర్

జాతీయ లోక్ అదాలత్‌ను 30న బెల్లంపల్లి కోర్ట్‌లో నిర్వహిస్తున్నట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. క్షణికావేశంలో చిన్నచిన్న నేరాలకు పాల్పడి ఇబ్బంది పడుతున్నవారికి, భార్యభర్తల మనస్పర్థల కేసులు, చిన్న యాక్సిడెంట్ కేసులు భూ తగదాల కేసులతో ఇబ్బంది పడుతున్న కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజీ మార్గం ద్వారా తమ సమస్యలను పరిష్కారించుకోవాలని సూచించారు. కేసుల పరిష్కారం కోసం బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్ వారిని సంప్రదించగలన్నారు.

న్యాయ పోరాటంలో గెలిచాం : వాసిరెడ్డి సీతారామయ్య

నవతెలంగాణ-నస్పూర్

రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం కుట్రలో భాగంగా ఈ రోజు కార్మికులందరూ న్యాయ పోరాటంలో గెలిచారని, 27వ తేదీన జరిగే ఎన్నికల ధర్మ పోరాటంలో ఏఐటీయూసీగా గెలవబోతున్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు సీతారామయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం ఎన్నికలు నిర్వహణ నిలిపివేయాలని వేసిన పిటిషన్‌పై విచారించిన కోర్టు 27న ఎన్నికలు నిర్వహించాలని తీర్పు ఇచ్చిందన్నారు.